క్లుప్తంగా

తడిసిన మొక్కజొన్నను కొనుగోలు చేయాలి



ఆర్మూర్: రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా తడిసిన మొక్కజొన్నను కొనుగోలు చేయాలని రైతు జేఏసీ నాయకులు ప్రభాకర్, దేగామ్ యాదగౌడ్, జక్క లింగారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో గురువారం ఆర్మూర్ డివిజన్ జేఏసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను నష్టం అంచన వేయడంతో రాష్ట్ర ప్రభుత్వ విఫలమైందన్నారు. ప్రభుత్వం మొక్కజొన్న రైతాంగానికి తాటిపత్రిలు వెంటనే అందజేయాలని, తడిసిన, కలర్ మారిన మొక్కజొన్నలను ఎంఎస్‌పీ రూ.2400 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటో ఆందోళన కార్యక్రమాలు చేయాల్సివస్తుందని హెచ్చరించారు.

మలేషియా నృత్య పోటీలకు ఎంపిక




పెర్కిట్(ఆర్మూర్): దసరా, బతుకమ్మ సంబురాలను పురస్కరించుకుని మలేషియాలో ఈ నెల 27నుంచి నిర్వహించనున్న శాస్త్రీయ నృత్య పోటీలకు ఆర్మూర్ విద్యార్థులు ఎంపికయ్యారు. మలేషియాలో సావిత్రిబాయి వుమెన్ వెల్ఫేర్ సొసైటీ, యునైటెడ్ హెరిటేజ్ ఆర్ట్స్ అండ్ కల్చర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఎంపికైన విద్యార్థినులు సదమస్తులు శ్రీయాన్షీ, శ్రీరాం శ్రీనిధి గురువారం మలేషియాకు బయలుదేరివెళ్లారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి



పెర్కిట్(ఆర్మూర్): పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీవో శివాజి సూచించారు. ఆర్మూర్‌లోని ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం ఎంఈవో రాజ గంగారాం అధ్యక్షతన అమ్మ ఆదర్శ పాఠశాలల హెచ్‌ఎంలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ఇదివరకే నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. నిధులు కేటాయించిన పాఠశాలల్లో త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు.

హున్సా సొసైటీ మహాజన సభ



బోధన్: సాలూర మండలంలోని హున్సా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వార్షిక మహాజన సభను గురువారం చైర్మన్ బుచ్చేల్‌వార్ రవి అధ్యక్షతన నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక జమా ఖర్చుల నివేదికను సీఈవో హన్మంత్‌రావు చదవి వినిపించారు. అనంతరం పలు తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. సొసైటీ వైస్ చైర్మన్ వినోద్ కులకర్ణి, డైరెక్టర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం అందించాలి



రెంజల్(బోధన్) : శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్‌తో నెల రోజుల కిందట ముంపునకు గురైన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈమేరకు వారు గురువారం తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. మండల బీజేపీ నాయకులు యోగేశ్, సంతోష్, ఆర్లరాజు, ప్రసాద్, రాజు, రమేష్, రూపేష్, మురళి, నాగరాజు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు చేయడం నేరం



బాల్కొండ: బాల్య వివాహాలు చేయడం నేరమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమాదేవి అన్నారు. బాల్కొండ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె అంగన్‌వాడీ టీచర్లకు, పంచాయతీ కార్యదర్శులకు బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు జరిపించాలన్నారు. అక్రమంగా పిల్లలను దత్తత తీసుకుంటే చర్యలు తప్పవన్నారు. ఇందుకోసం వెంటనే గ్రామస్థాయి, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎస్సై శైలెందర్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కేసి పువ్వేసి చందమామ..



బొప్పాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మంగల్‌పాడ్ గ్రామంలో..



సాక్షి నెట్‌వర్క్ : 'ఒక్కేసి పు వ్వేసి చందమామ.. ఒక్క జాము ఆయె చందమామ', 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. మావూరి బతుకమ్మ ఉయ్యాలో' అంటూ బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలు గ్రామాల్లో సందడి చేశారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో గురువారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే మహిళలు, యువతులు వివిధ రకాల పూలను సేకరించి, బతుకమ్మలను పేర్చారు. సాయంత్రం వేళ గ్రామాల్లోని బతుకమ్మలను ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాటి చుట్టూ మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలు చేశారు. పలుచోట్ల యువతులు బతుకమ్మల చుట్టూ కోలాటం ఆడుతూ సందడి చేశారు. అక్కడి నుంచి బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి, సమీపంలోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.



పాత పోతంగల్ గ్రామంలో..



అంబం (వై)లో బతుకమ్మలతో మహిళలు



రెంజల్‌లో..



మంగల్‌పాడ్‌లో..



నవీపేటలో..

ఆగని వర్షం

ఆర్మూర్‌టౌన్/వేల్పూర్: ఆర్మూర్ పట్టణంలో ఉదయం నుంచి వర్షం ఏకదాటిగా కురుస్తుంది. దీంతో ప్రజలు ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం పనులకు వెళ్లాల్సిన వారు ముసురు వానతో ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల వర్షం దాటికి రోడ్లన్ని జలమయమైయ్యాయి. కొన్ని చోట్ల మురికికాలువలు పొంగిపోర్లాయి. వేల్పూర్ మండలం పడగల్ ఊర చెరువుకు భారీగా వరద నీరు చేరి అలుగు ప్రవహిస్తోంది.



ఆర్మూర్‌లో వర్షానికి ఉప్పొంగిన డ్రైయినేజీ



అలుగు పారుతున్న పడగల్ ఊర చెరువు



బినోల నుంచి గోదావరి నదికి వెళ్లే దారిపై చేరిన వరద నీరు



నందిగామకు వెళ్లే దారిలో..

కోనోకార్పస్ చెట్లను తొలగించాలి



పోచంపాడ్‌లో ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లో ఏపుగా పెరిగిన కోనోర్పాస్ చెట్లను తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. కోనో కార్పస్ చెట్లు ప్రజల ఆరోగ్యానికి హానికరమని పలుమార్లు ఆరోగ్య సంస్థలు హెచ్చరించాయి. కానీ పోచంపాడ్‌లో మాత్రం జాతీయ రహదారి 44 నుంచి శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్ వరకు ఆ చెట్లను అలానే ఏపుగా పెంచుతున్నారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అలాగే బస్టాండ్, పల్లె ప్రకృతి వనంతోపాటు గ్రామంలోని ప్రధాన వీధుల్లో కూడ ఇవే చెట్లను పెంచుతున్నారు. ఉన్నత అధికారులు స్పందించి వెంటనే ఈ చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నత అధికారులకు నివేదించాం..

పోచంపాడ్‌లో రోడ్డు మధ్యలో పెంచిన కోనోకార్పస్ చెట్లను తొలగింపు కోసం ఉన్నత అధికారులకు నివేదించాం. ఉన్నత అధికారుల నుంచి అనుమతి రాగానే తొలగిస్తాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– భోజన్న, పంచాయతీ కార్యదర్శి, పోచంపాడ్

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- బోధన్‌లో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన



బోధన్ శివారులో విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించమే ప్రభుత్వ లక్ష్యమని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆచన్‌పల్లి శివారులో గురువారం ఆయన 33/11 కే.వీ. విద్యుత్ ఉప కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో విద్యుత్ భారం పడకుండ పట్టణంలో విద్యుత్ ఉప కేంద్రంతోపాటు బోధన్ మండలంలోని జాడీజమాల్‌పూర్, నవీపేట్ మండలం హనుమాన్ ఫారంలోనూ విద్యుత్ ఉపకేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మూడు నెలల్లో విద్యుత్ ఉపకేంద్రం పూర్తిచేసే విధంగా పని చేస్తామన్నారు. తెలంగాణ కో–ఆపరేటీవ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, పీసీసీ కార్యదర్శి నగేష్‌రెడ్డి, నాయకులు పాషా మోయినొద్దిన్, నాగేశ్వర్‌రావ్, పులి శ్రీనివాస్, గంగాశంకర్, హరికాంత్ చారీ, తూము శరత్‌రెడ్డి, దాము, విష్ణు వర్ధన్‌రెడ్డి ఉన్నారు.

కుంకుమార్చనలు.. అన్నదానాలు

నందిపేట్/ఆర్మూర్‌టౌన్/రెంజల్/వర్ని: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారు గురువారం కాత్యాయని మాత అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వేడుకల్లో భాగంగా ఆయా నియోజకవర్గాల్లోని దుర్గామాత మండపాల వద్ద అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అలాగే పలుచోట్ల మండపాల నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎడపల్లి మండలం ఏఆర్‌పీ క్యాంపు గ్రామంలోని దుర్గామాత మండపం వద్ద గ్రామానికి చెందిన ఉబేద్ హైమద్ అనే ముస్లిం వ్యక్తి తన స్నేహితులతో కలిసి అన్నదానం నిర్వహించారు.



కాల్‌పూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



ఆర్మూర్ పట్టణంలో..



జలాల్‌పూర్‌లో..



ఏఆర్‌పీ క్యాంప్‌లో అన్నదానం నిర్వహిస్తున్న ముస్లింలు

సంక్షిప్తం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



మాక్లూర్: మండల కేంద్రానికి చెందిన ఓ బాధిత కుటుంబానికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గురువారం నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌రావు అందజేశారు. మాజీ సర్పంచ్ రాజేందర్, అలీమ్, మల్లేష్‌గౌడ్, జాఫర్, రామాగౌడ్, లక్ష్మినారాయణ, రాజ్ మల్లయ్య, ఎస్‌కె అరీఫ్, శ్రీను, భూమన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సభ్యుడికి రాక్‌స్టార్ అవార్డు



రుద్రూర్: మండల కేంద్రానికి చెందిన లయన్స్ క్లబ్ సభ్యుడు శ్యామ్ సుందర్ పహడేకు రాక్ స్టార్ అవార్డ్ లభించింది. జులైలో అమెరికాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకోవాల్సి ఉండగా, అనివార్య కారణాలతో వెళ్లలేకపోయాడు. దీంతో లయన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ లయన్ ఘట్టమనేని బాబురావు ఇటీవల అతడికి అవార్డు అందజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



బోధన్: శారద ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో జాతీయ స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా బోధన్‌లోని తట్టికోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఇందూర్ లలిత ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు సాధించింది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం, నిర్వాహకులు అవార్డును అందించి ఆమెను సత్కరించారు.

రిటైర్డ్ ఫార్మాసిస్టుకు సన్మానం



రెంజల్(బోధన్): మండల కేంద్రంలో గురువారం ఫార్మసిస్ట్ డే సందర్భంగా రిటైర్డ్ ఫార్మాసిస్ట్ కృష్ణను రెంజల్ గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మోస్రాలో శ్రమదానం



వర్ని/రుద్రూర్: మోస్రాలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జీపీ సిబ్బంది వారంతపు సంతను శుభ్రం చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, వీడీసీ అధ్యక్షుడు పోత రెడ్డి పాల్గొన్నారు. అలాగే పోతంగల్ మండలం హంగర్గ గ్రామంలో జీపీ సిబ్బంది, ఆశాకార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు పరిసరాలను శుభ్రం చేశారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల బిల్లులు ఇవ్వాలి

రుద్రూర్: పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల బిల్లులు వెంటనే చెల్లించాలని కోటగిరి డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు డిమాండ్ చేశారు. కోటగిరిలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నామని, రావాల్సిన బిల్లుల కోసం అధికారులు, నాయకుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నామని వాపోయారు. బిల్లులు ఇవ్వడంలో జాప్యం చేస్తే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ టీచర్ల అరెస్ట్ సరికాదు

బోధన్‌టౌన్(బోధన్): తమ సమస్యల పరిష్కారం కోసం 'చలో సెక్రెటేరియేట్' కార్యక్రమానికి వెళుతున్న అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడం సరికాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ అన్నారు. బోధన్ నుంచి వెళుతున్న అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు గురువారం తెల్లవారు జామున అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం హామీలను అమలు చేయాలని, లేదంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

కల్లెడిలో వైద్యశిబిరం



మాక్లూర్: మండలంలోని కల్లెడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం స్వస్థ్ నారీ– సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమున్న వారికి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారులు ప్రవీణ్ రెడ్డి, ప్రభాకర్, మమత, ఏఎన్‌ఎంలు సుజాత, ప్రమీలా, దమయంతి పాల్గొన్నారు.

ఘనంగా దీన్ దయాల్ జయంతి




ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు.. రుద్రూర్‌లో..

ఆర్మూర్‌టౌన్/రుద్రూర్/బోధన్/బోధన్‌టౌన్/వర్ని: భారతీయ జనతా పార్టీ సిద్ధాంత కర్త పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో గురువారం దీన్ దయాల్ చిత్రపటానికి బీజేపీ శ్రేణులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. పలు గ్రామాల్లో పార్టీ నాయకులు మొక్కలను నాటారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. దీన్ దయాల్ సేవలను కొనియాడారు.



ఎడపల్లి మండల కేంద్రంలో..



వర్నిలో..

నాన్‌స్టాప్ బస్సులు నడపాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): నిజామాబాద్ నుంచి నందిపేట్ వరకు నడుపుతున్న నాన్‌స్టాప్ బస్సులను డొంకేశ్వర్ వరకు పొడిగించాలని బీజేపీ సీనియర్ నాయకులు ఆరే గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రీజినల్ మేనేజర్‌కు ఫోన్ ద్వారా ఆయన విన్నవించారు.

చదువుతోపాటు క్రీడలు ముఖ్యం



బాల్కొండ: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమేనని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ముప్కాల్ మండల కేంద్రం గురువారం నునుగొండ శ్యామల స్మారక 35వ జూనియర్ రాష్ట్రస్థాయి బాలబాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముప్కాల్ కబడ్డీ క్రీడాకారులకు పుట్టినిల్లు అన్నారు. కబడ్డీ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు లింగయ్య, ప్రధాన కార్యదర్శి గంగాధర్, ముప్కాల్ స్పోర్ట్స్ అథారిటీ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.